సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 2 । ఆగస్టు । 2025



ఎనిమిదేళ్లుగా అవే పనులు..
ఎనిమిదేళ్లుగా జాతీయ రహదారి పనులు పూర్తికాలేదు. కిన్నెరసానిపై కొత్త బ్రిడ్జి మంజూరైనా ప్రారంభించలేదు.
8లో



గ్రామాల్లో ట్రెయినీ కలెక్టర్..
ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ పలు గ్రామాల్లో పర్యటించారు. తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.
8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
33° / 25°
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచ హారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

54 మంది బాలకార్మికులకు విముక్తి

కొత్తగూడెంటౌన్: ఆపరేషన్ ముస్కాన్–11తో జిల్లావ్యాప్తంగా 54 మంది బాలలకు విముక్తి కలిగించినట్లు ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో జూలై 1నుంచి 31వరకు ఐదు బృందాలతో ఆపరేషన్ ముస్కాన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 44 మంది బాలురు, 10 మంది బాలికలను గుర్తించినట్లు తెలిపారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి 53 మంది పిల్లలను అప్పగించామని, ఒక్కరిని హోంకు తరలించామని వివరించారు. పిల్లలను పనుల్లో పెట్టుకున్న 39 మందిపై కేసులు నమోదు చేశామని, 13 మందికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి

- ఆర్టీఐ కమిషనర్ అయోధ్యరెడ్డి



ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న ఆర్టీఐ కమిషనర్ అయోధ్య రెడ్డి

దమ్మపేట: తోటలను చూస్తే తనకు కూడా ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి కలుగుతోందని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెందిన ఆయిల్‌పామ్ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. అంతర పంటలు కోకో, జాజికాయ సాగు గురించి తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను తట్టుకుని నిలబడటమే కాక ధర దృష్ట్యా ఆయిల్‌పామ్ పంట రైతులకు లాభదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్ రెడ్డి, రైతు సంఘం నాయకులు కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య వస్తే షీ టీంను సంప్రదించాలి

- ఎస్పీ రోహిత్‌రాజు


కొత్తగూడెంటౌన్: మహిళలు ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపుల వంటి సమస్యలపై నిర్భయంగా షీటీంను సంప్రదించాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. శుక్రవారం చుంచుపల్లి ఏహెచ్‌టీయూ ఆఫీస్‌లోని షీటీం కార్యాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ షీ టీం సభ్యులు రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌లు, విద్యాసంస్థలు రద్దీగా ఉన్న ప్రదేశాల్లో మఫ్టీలో సంచరిస్తూ, నేరస్తులు, ఆకతాయిల కదలికలను గుర్తించాలని ఆదేశించారు. మహిళల సమస్యల పరిష్కారం ఓసం అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. షీ టీం నంబర్‌కు 87126 82131 సమస్యలపై ఫిర్యాదు చేయాలని కోరారు. సీఐ రాము,ఎస్సై నాగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను నియమించాలని కలెక్టర్‌కు ఆదేశాలు!

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. నూతన జిల్లా విద్యాశాఖాధికారి నియామకంపై నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కలెక్టర్ నిర్ణయం తర్వాత నూతన డీఈఓ ఎవరూ అనేది తెలియనుంది.

పంటల సాగు 80 శాతం..

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు ఆలస్యమైంది. జూలై మొదటి వారంలో, చివరలో కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పత్తి, ఆయిల్‌పామ్ సాధారణానికి మించి సాగు చేశారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు పంటల సాగు 79.3 శాతం నమోదైంది. వ్యవసాయ శాఖ వివిధ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 5,91,714 ఎకరాలుగా అంచనా వేయగా 4,69,202 ఎకరాల్లో సాగు చేశారు. వానాకాలం సీజన్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆగస్టులో మిర్చి సాగు ప్రారంభిస్తారని వ్యవసాయాధికారులు తెలిపారు.
–సూపర్‌బజార్(కొత్తగూడెం)



- వానాకాలం సాధారణ విస్తీర్ణంలో మూడొంతులకు పైగా పూర్తి
- జిల్లాలో ఇప్పటికే అంచనాకు మించి సాగైన పత్తి పంట
- ముమ్మరంగా సాగుతున్న వరినాట్లు, పూర్తయిన మొక్కజొన్న

జూలై 31వ తేదీ వరకు జిల్లాలో పంటల వారీగా సాగు విస్తీర్ణం
(ఎకరాల్లో, + అంచనాకు మించి)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగు	సాగు చేయాల్సింది
వరి	1,64,662	43,373	1,21,088.8
పత్తి	2,03,560.36	2,11,295.31	+ 7,734.95
మొక్కజొన్న	85,827	84,273	1,154
పెసర	128	346	+ 218
మినుము	840	22	818
కంది	1,135	1,071	64
వేరుశెనగ	2,736	0	2,736
జీలుగ	5,365	9,415	+4,050
జనుము	353	354	+ 1
ఆయిల్‌పామ్	63,485	77,500	+1,415
మిర్చి	10,283	0	10,283
పండ్లు, ఇతర రకాలు	9,995	10,012	+17
కూరగాయలు	491	50	441
ఆగ్రో ఫారెస్ట్రీ	28,414	29,515	+1,101
ఇతరములు	14,439	1,776	12,663

వర్షాలతో సాగు ముమ్మరం



వర్షాలు కురవడంతో వానాకాలం సాగు పనులు ముమ్మరమయ్యాయి. దాదాపు 80 శాతం పంటలు సాగు చేశారు. రైతులు సమీపంలోని వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలి.
– వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

మొదట్లో భయపెట్టింది



మొదట వర్షాలు కురవక భయపెట్టాయి. జూలై మొదటి వారంలో కురిసినా ఆశించిన స్థాయిలో పడలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులను వేగవంతం చేశాం.
– పూనెం ప్రశాంత్, రైతు, ముత్తాపురం, గుండాల మండలం

సీజన్ ఆలస్యంగా ప్రారంభం

వర్షాలు సకాలంలో కురవని కారణంగా వానాకాలం సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. తొలకరి వర్షాలతో రైతులు ఆనందపడ్డా ఆ తర్వాత జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో కురవాల్సిన వర్షాలు మే మాసంలో కురవడం విశేషం. జూన్‌లో జిల్లాలో సరాసరి వర్షపాతం 169.1 మి.మీ కాగా, 134.4 మి.మీ మాత్రమే నమోదైంది. సాధారణం కంటే 20.5 శాతం లోటు ఉంది. జూలైలో సాధారణ వర్షపాతం 312.7 మి.మీ కాగా, 378.9 మి.మీ నమోదైంది. 21 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఆరు మండలాలు మణుగూరు, టేకులపల్లి, జూలూరుపాడు, చండ్రుగొండ, పాల్వంచ, అశ్వారావుపేటలలో అధిక వర్షపాతం, కరకగూడెం, చర్ల, అశ్వాపురం, ఆళ్లపల్లి, గుండాల, ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెం, పినపాక మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే ఉంది.

యూరియా కొరత లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళనకు గురి కావొద్దని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ, సహకార, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పంటల సాగుకు అవసరమైన యూరియాను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేయడంతో యూరియాకు డిమాండ్ పెరిగినట్లు కనిపిస్తుందని అన్నారు. యూరియాను పంటల సాగుకు కాకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నంబర్ ఆధారంగా సరఫరా వివరాలు నమోదు చేయాలని సూచించారు. యూరియాకు బదులు రైతులు నానోయూరియా ఉపయోగించే విధం గా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈసీజన్‌లో వెయ్యి ఎకరాల మునగసాగు లక్ష్యంగా పెట్టుకోవాలని, తక్కువ ఖర్చుతో రైతులకు ఎక్కువ ఆదా యం సమకూరుతుందని వివరించారు. అజొల్లా పెంపకం, బయోచార్‌పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఏఓ బాబూరావు, డీఎస్‌ఓ అవధాని శ్రీనివాసరావు, డీపీడీ ఆత్మ సరిత, మార్క్‌ఫెడ్ డీఎం సునీత, సొసైటీ సీఈఓలు, వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

సెర్ప్‌లో కొనసాగుతున్న బదిలీలు

- 26 మంది ఏపీఎంల పోస్టింగ్ పూర్తి
- త్వరలో ఇతర సిబ్బంది కౌన్సెలింగ్



డీఆర్‌డీఓ విద్యాచందనకు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న ఏపీఎంలు

చుంచుపల్లి: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) విభాగంలో బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాస్థాయి అధికారి నుంచి సీసీ వరకు బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఇటీవల జిల్లా నుంచి ఆరుగురు డీపీఎంలను వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. పది రోజుల క్రితం ఏపీఎంలను బదిలీలకు ఉత్తర్వులు జారీ కావడంతో కొందరిని జిల్లా నుంచి ఇతర జిల్లాలకు, ఇతర జిల్లాల నుంచి జిల్లాకు కేటాయించారు. వీరికి గత నెల 26న పోస్టింగ్ ఆర్డర్‌లు జారీ చేశారు. గురువారం రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వగా, శుక్రవారం వారికి కేటాయించిన స్థానాల్లో చేరారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, జనగామ, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఆరుగురు ఏపీఎంలు జిల్లాకు వచ్చారు. జిల్లాలో పనిచేస్తున్న 19 మంది ఏపీఎంలకు ఒక మండల నుంచి మరో మండలానికి స్థానచలనం కల్పించారు. జిల్లాలో అన్ని కేడర్లు కలిపి మొత్తం 156 మంది పని చేస్తున్నారు. ఇందులో ఏపీడీ, డీపీఎం, సీసీలు, అడ్మిన్ అసిస్టెంట్లు, అటెండర్లు, డ్రైవర్లు ఉన్నారు. డీపీఎంలు, ఏపీఎంల బదిలీల ప్రక్రియ పూర్తి కాగా, ఇక సీసీలు, అడ్మిన్ అసిస్టెంట్లు, అటెండర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. కాగా సెర్ప్‌లో పదేళ్ల తర్వాత బదిలీల ప్రక్రియ చేపట్టారు. దీంతో పలువురికి ఊరట లభించనుంది. శుక్రవారం విధుల్లో చేరిన ఏపీఎంలు డీఆర్‌డీఓ విద్యాచందనను కలిశారు.

కూలీలతో భోజనం.. ఆపై వరి పొలం దమ్ము, నాట్లు

రైతులా గడిపిన ఇల్లెందు ఎమ్మెల్యే



ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శుక్రవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. అనంతరం బేతంపూడి గ్రామంలో సామాన్య రైతులా మారారు. అక్కడ వరి నాట్లు వేస్తున్న కూలీలతో కలిసి భోజనం చేసిన ఆయన ట్రాక్టర్ నడుపుతూ పొలంలో దమ్ము చేశారు. ఆ తర్వాత యూరియా చల్లడంతో పాటు వరి నారు తీస్తూ కూలీలతో కలిసి నాట్లు వేశారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీడీఓ మల్లేశ్వరి, ఆత్మ చైర్మన్ మంగీలాల్ తదితరులు నాట్లు వేయడం విశేషం. – టేకులపల్లి



సీజనల్ వ్యాధులను అరికట్టాలి



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న ఆయుష్ డైరెక్టర్ శ్రీధర్

కొత్తగూడెంఅర్బన్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్, సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రత్యేక అధికారి డాక్టర్ జి.శ్రీధర్ సూచించారు. శుక్రవారం ఆయన కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని, పాల్వంచలో ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, చండ్రుగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు ఇంటింటి సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. డీఎంహెచ్‌ఓ ఎస్. జయలక్ష్మి, వైద్యాధికారులు రాధామోహన్, రమేష్, స్పందన, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

హమాలీలకు భద్రత ఏది..?

- అందని ఈఎస్‌ఐ, పీఎఫ్, బీమా సదుపాయాలు
- పట్టించుకోని జీసీసీ, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు



పీడీఎస్ బియ్యం అన్‌లోడ్ చేసేందుకు సిద్ధమవుతున్న హమాలీలు

ఇల్లెందు: గిరిజన సహకార సంస్థ(జీసీసీ), పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీలు కనీస సౌకర్యాలకు నోచుకోవడంలేదు. పలుమార్లు ఆందోళన చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. జిల్లాలో ఐదు జీసీసీ బ్రాంచీలు, ఐదు సివిల్ సప్లాయీస్ ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఇల్లెందు జీసీసీలో 80మంది, పాల్వంచలో 25, భద్రాచలంలో 16, అశ్వాపురంలో 16, దమ్మపేటలో 15 మంది.. మొత్తం 168 మంది హమాలీలు పనిచేస్తున్నారు. సివిల్ సప్లయీస్ విభాగం నుంచి బియ్యం, జీసీసీ నుంచి సరుకులు డీఆర్ డిపోలు, హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలలకు రవాణా చేస్తున్నారు. ఇటీవల మూడునెలల కోటా పంపిణీ కోసం హమాలీలు రాత్రీపగలు కష్టపడ్డారు. పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించి ఈఎస్‌ఐ, పీ ఎఫ్, ఇన్సూరెన్సు, హెల్త్‌కార్డులు వంటి సదుపాయాలు కల్పించాలని హమాలీలు కోరుతున్నారు. హమాలీలకు క్వింటాల్‌కు రూ.29చొప్పున చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.7500 పారితోషికం, 2జతలబట్టలు, ఇతర సదుపాయాల కోసం రూ. 2500 చెల్లిస్తున్నారు. వీటి నుంచి ప్రతీ నెల రూ. 200 చెల్లిస్తే రూ.5లక్షల వరకు ఈఎస్ఐ సదుపాయం లభిస్తుంది. ఒకవేళ కార్మికుడు మృతి చెందితే రూ.20 వేల దహన సంస్కారాల కోసం చెల్లిస్తారు. ఒక్కో హమాలీకి రూ. 22 చొప్పున పీఎఫ్ చెల్లిస్తే ఉద్యోగ విరమణ వయసు నాటికి సుమారు రూ.7 లక్షలు వరకు చేతికి వచ్చే అవకాశం ఉంది. పింఛనూ లభిస్తుంది. ఏడాదికి రూ.వెయ్యి చెల్లిస్తే రూ. 20లక్షల వరకు ప్రమాద బీమా లభించే అవకాశం ఉంటుంది. ఇంకా సింగరేణి తరహాలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకుంటే సింగరేణి కార్మికులకు జరిగినట్లు మరింత మేలు జరుగుతుంది. రాష్ట్ర పునర్విభజన తర్వాత ఈపీఎఫ్ నిధులు చెల్లించకుండా జాప్యంచేస్తున్నట్లు హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుస్తుల కుట్టుకూలీ రూ.1600 చెల్లించా లని, ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచాలని కోరుతున్నారు.

సమగ్ర చట్టం తేవాలి



సివిల్ సప్లయీస్ విభాగంలో పని చేసే హమాలీల కోసం ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలి. హమాలీ కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్, బీమా సదుపాయం కల్పించాలి.
–యాకుబ్ షావలీ, టీయూసీఐ నాయకుడు, ఇల్లెందు

పీఎఫ్ కల్పించాలి



జీసీసీ హమాలీలకు పీఎఫ్, బీమా సదుపాయాలు కల్పించాలి. ఏడాదికి రెండు జతల బట్టలు అందజేయాలి. సమస్యలపై సివిల్ సప్లయీస్ శాఖ కమిషనర్, జీసీసీ ఎండీ స్పందించాలి.
– బాజ శ్రీను, జీసీసీ హమాలీ, ఇల్లెందు

జిల్లాకు సంపూర్ణత అభియాన్ అవార్డు

నేడు గవర్నర్ నుంచి అందుకోనున్న కలెక్టర్

చుంచుపల్లి: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాలు, మండలాలను ఆకాంక్షిత జిల్లా, బ్లాక్‌లుగా గుర్తించి నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో వేగవంతమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలో జిల్లాలో విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలకు చెందిన ఆరు సూచికలను 100 శాతం సాధించాలనే లక్ష్యంతో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా జిల్లాస్థాయిలో ఆరు సూచికల్లో మూడింటిని విజయవంతంగా పూర్తిచేశారు. బ్లాక్ స్థాయిలో గుండాల మండలంలో ఐదు సూచికలను పూర్తి చేసి అగ్రభాగంలో నిలిచారు. దీంతో నీతి ఆయోగ్ అధికారులు సంపూర్ణత అభియాన్ అవార్డుకు రాష్ట్రస్థాయిలో భద్రాద్రి జిల్లాను ఎంపిక చేశారు. జయశంకర్ భూపాలపల్లి, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలు కూడా ఎంపికయ్యాయి. ఆకాంక్షిత బ్లాక్ విభాగంలో జిల్లాలోని గుండాల తోపాటు మరో తొమ్మిది బ్లాక్‌లను ఎంపిక చేశారు. శనివారం హైదరాబాద్ రాజభవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అవార్డు అందుకోనున్నారు.

క్లుప్తంగా

జీజేసీ అధ్యాపకుడికి డాక్టరేట్


అమరపురి త్రినాథ్

పాల్వంచరూరల్: పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శంకర్ శుక్రవారం తెలిపారు. అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామానికి చెందిన అమరపురి త్రినాథ్ పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు భౌతికశాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. త్రినాథ్ మాట్లాడుతూ తన పరిశోధనకు సహకరించిన సూపర్‌వైజర్, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసలు, ప్రొఫెసర్ విఠల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలో ప్రవేశాల కోసం జిల్లాలోని గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ బి.రాహుల్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆరుగురు గిరిజన విద్యార్థులు కోయ-3, లంబాడా-2, మిగిలిన గిరిజన కులాల వారికి-1 (ఇందులో బాలురకు-3, బాలికలకు-3) సీట్లు ఉన్నాయని, లాటరీ ద్వారా ఎంపిక చేసి ఒకటో తరగతిలో ప్రవేశం (డే స్కాలర్) కల్పిస్తారని వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లల దరఖాస్తులు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, ఉప సంచాలకుల కార్యాలయం నుంచి తీసుకుని, ఆధార్‌కార్డు, ఆదాయం, కులం, నివాస, జనన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేసి, ఒరిజినల్ ధ్రువపత్రాలు కూడా తీసుకొని ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని సూచించారు.

మురుగుతో ప్రజల అవస్థలు


జనావాసాల మధ్య నిలిచిన మురుగునీరు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఓ ఫంక్షన్ హాల్ పక్కన ఖాళీ స్థలంలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు చేరింది. జనవాసాల మధ్యలో నిలిచిన ఈ మురుగునీటితో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఫంక్షన్ హాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అజొల్లాతో యూరియా వాడకానికి చెక్..


పొలంలో అజొల్లా వదులుతున్న డీఏఓ, డీపీడీ

టేకులపల్లి: వరి పొలాల్లో అజొల్లా వినియోగిస్తే యూరియా వాడకం తగ్గుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సరిత సూచించారు. శుక్రవారం మండలంలోని ఏ కాలనీకి చెందిన బానోతు సుధాకర్ వరి పొలంలో అజొల్లాను వదిలారు. అనంతరం అజొల్లా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఆ తర్వాత టేకులపల్లి, కోయగూడెం, కొత్తతండా గ్రామాల్లోని ఎరువుల షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏఓ అన్నపూర్ణ, ఏఈఓలు భాగ్యశ్రీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

16 మంది విద్యార్థులు ప్రభుత్వ బడికి..


ఉద్దీపకం పుస్తకాలను అందిస్తున్న రమేశ్

చంద్రుగొండ: గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల అకడమిక్ మానిటరింగ్ జిల్లా అధికారి (ఐటీడీఏ) కె.రమేశ్ చొరవతో ఓ గ్రామంలోని 16 మంది విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరారు. మండలంలోని సామ్యాతండా గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో ఒక్క విద్యార్థి హాజరు కాకపోవడంతో పాఠశాల మూతబడిన అంశంపై ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. స్పందించిన గ్రామస్తులు 16 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. వీరిలో గతంలో ఇదే పాఠశాలలో చదివి మానేసిన వారు ఉండగా.. మరికొందరు కొత్తవారు ఉన్నారు. కాగా, పాఠశాలలో చేరిన ఆయా విద్యార్థులకు ఉద్దీపకం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీ హరిలాల్, ఇస్లావత్ వీరన్ననాయక్, బి.వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

ఎనిమిదేళ్లుగా అవే పనులు..

- కిన్నెరసాని వాగుపై బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో?
- ప్రమాదకరంగా బీసీఎం జాతీయ రహదారి
- 2017 నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా ఇంకా అసంపూర్తిగానే..


నాగారం కాలనీ వద్ద దెబ్బతిన్న రహదారి


ఆరోగ్యమాత చర్చి వద్ద అధ్వానంగా ఉన్న జాతీయ రహదారి

పాల్వంచరూరల్: జాతీయ రహదారి గుండా వెళ్తున్న కిన్నెరసానివాగుపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. కొత్త బ్రిడ్జి మంజూరైనా పనులు మొదలు కాలేదు. శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి వల్ల 24 గంటలూ రద్దీగా ఉండే బీసీఎం 30వ నంబర్ జాతీయ రహదారిపై ప్రమాదాలకు అవకాశం ఉంది. వాహనదారులు భయాందోళనల నడుమ రహదారిపై ప్రయాణించాల్సి వస్తోంది.

8 ఏళ్లుగా సాగదీత..

సారపాక నుంచి రుద్రంపూర్ వరకు మూడో ప్యాకేజీ కింద రూ.299 కోట్ల వ్యయంతో 42 కిలోమీటర్ల 30వ నంబర్ జాతీయ రహదారి పనులు 2017 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఎనిమిదేళ్లుగా రోడ్డు పనులు దక్కించుకున్న కంపెనీ పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వదిలేసింది. ప్రధాన రహదారి పనులు అసంపూర్తిగా ఉండగా ఇంకా డ్రెయినేజీ, ఫుట్‌పాత్ పనులు కూడా పూర్తి కాలేదు.

అసంపూర్తిగానే..

ప్రధాన రహదారిపై సీతానాగారం, బస్వతారకకాలనీ, లక్ష్మీదేవిపల్లి, జీసీసీ కార్యాలయం నుంచి సీ-కాలనీ గేటు వరకు సుమారు రెండు నుంచి మూడు కిలోమీటర్ల పొడవునా మరో లేయర్ తారు నిర్మాణం చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో పాత తారు అంతా లేచిపోయి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కేశవాపురం సమీపంలో నిర్మించిన క్వలర్టు వద్ద కొద్దిరోజులకే రోడ్డు కుంగిపోగా తిరిగి మరమ్మతులు చేశారు. వర్షాలకు తిరిగి కోతకు గురైంది. అక్కడే నడిరోడ్డుపై గుంత ఏర్పడటంతో తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో నిర్మించిన రోడ్డుకు బీటలువారింది. జగన్నాథపురం, నాగారంకాలనీ మధ్య ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద రోడ్డు దెబ్బతింది. ఇంకా ఫుట్‌పాత్ పనులు పూర్తి చేయకపోవడంతో డ్రెయినేజీ, వర్షం నీరు రహదారిపై ప్రవహిస్తోంది. కాగా, రోడ్డు మధ్యలో డివైడర్లను కూడా అసంపూర్తిగానే నిర్మించారు.

బ్రిడ్జి మంజూరై ఏడాది..

బీసీఎం జాతీయ రహదారిలోని రంగాపురం వద్ద గల కిన్నెరసాని వాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. గతేడాది కిన్నెరసాని వాగు పొంగిపొర్లడంతో వరద నీరు బ్రిడ్జి పైనుంచి ప్రవహించింది. బ్రిడ్జి చివరలో కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలిపివేసి పాండురంగాపురం ఉప్పసాక మీదుగా మళ్లించి, తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. దీంతో 2024లో రూ.22 కోట్లను బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించారు. గతేడాది పనులను ప్రారంభిస్తామని చెప్పినా ఇంతవరకు మొదలుపెట్టలేదు. ఈ పనులకు ఢిల్లీ నుంచి సాంకేతిక అనుమతులు రావాల్సి ఉందని చెబుతున్నారు. అనుమతులు రాగానే టెండర్లు పిలుస్తామని హైవే అథార్టీ అధికారి ఒకరు చెప్పారు. కాగా, వానాకాలం వరదలు వస్తే భద్రాచలం వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదరయ్యే అవకాశం ఉంది. అధికారులు బ్రిడ్జి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను త్వరితగతిన ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ రద్దు కోసం ప్రతిపాదనలు..

బీసీఎం హైవే పనులు ఇంకా పూర్తికావాల్సి ఉంది. రంగాపురం వద్ద కిన్నెరసానివాగుపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. టెక్నికల్ అనుమతులు రావాల్సి ఉంది. 20 కిలోమీటర్ల పొడవున నిర్మించాల్సిన ఫుట్‌పాత్, డ్రెయినేజీ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కొంతదూరం మరో లేయర్ తారు వేయాల్సి ఉంది. పలుమార్లు కంపెనీ కాంట్రాక్టర్‌కు నోటీసులు కూడా జారీచేశాం. అయినా స్పందించడం లేదు. కంపెనీ కాంట్రాక్టును రద్దు చేసి కొత్తవారికి పనులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించాం.

–యుగంధర్, ఎన్‌హెచ్ ఈఈ

గ్రామాల్లో పర్యటించిన ట్రెయినీ కలెక్టర్


మణుగూరురూరల్: ట్రెయినీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మదీనానగర్ వాసులు

మణుగూరురూరల్: మండలంలోని కట్టుమల్లారం, ముత్యాలమ్మనగర్ గ్రామ పంచాయితీల పరిధిలో ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ శుక్రవారం పర్యటించారు. కట్టుమల్లారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ ఆవరణలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ముత్యాలమ్మనగర్‌లో పంచాయతీ కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మదీనానగర్‌వాసులు ట్రెయినీ కలెక్టర్‌కు పలు సమస్యలను విన్నవించారు. తిర్లాపురంలో మునగ ప్లాంటేషన్, పౌల్ట్రీఫామ్, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించాక, రామానుజరం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో చర్చించారు. సాంబాయిగూడెంలో వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, అంగన్‌వాడీ, ఆరోగ్య ఉప కేంద్రాలు, కమ్యూనిటీ సోక్‌పిట్‌లను సందర్శించి, బీటీపీఏస్‌కు వెళ్లి.. సీఈ బిచ్చన్నను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఆర్‌ఐ గోపి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనుండగా.. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ ఆవిష్కరించారు. తల్లిపాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు 2న పీహెచ్‌సీల్లో తల్లులు, కుటుంబ సభ్యులకు తల్లిపాలపై అవగాహన, 4న అన్నప్రాసనలు, 5న ఇంటింటికీ వెళ్లి అవగాహన, 6న చేతులను శుభ్రం చేసుకునే అంశంపై అవగాహన, 7న స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా, సెర్ప్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి తల్లిపాలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ పి.సంపత్, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ బి.రాము, బ్లాక్ కోఆర్డినేటర్ సోని, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

రామానుజవరంలో సర్వే ప్రారంభం


రామానుజవరంలో భూముల సర్వే చేస్తున్న సిబ్బంది

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీ విస్తరణ భూసేకరణ నేపథ్యంలో రామానుజవరంలో చేపడుతున్న సర్వేను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొనగా.. ఎస్‌డీసీ సుమ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మణుగూరు ఓసీ విస్తరణకు 813 ఎకరాలను కొమ్ముగూడెం, తిర్లాపురం, రామానుజవరం గ్రామాల్లో సేకరించనుండగా కొమ్ముగూడెంలో 96 ఎకరాల సర్వే పూర్తయింది. ప్రస్తుతం తిర్లాపురంలో సర్వే కొనసాగుతోందని వెల్లడించారు.

20న ప్రజాభిప్రాయ సేకరణ

ఓసీ విస్తరణలో భాగంగా ఈ నెల 20న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్టేడియంలో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా సింగరేణి అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మాజీ ఉద్యోగి అరెస్ట్

కొత్తగూడెంటౌన్: సింగరేణి మాజీ ఉద్యోగి జీకే సంపత్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు. ఈయనపై సింగరేణి భవన్‌కు చెందిన ఓ ఉద్యోగి ఫిర్యాదు చేయగా.. అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు వెల్లడించారు. సింగరేణి భవన్‌కు చెందిన జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తగూడెంనకు చేరుకున్న హైదరాబాద్ పోలీసులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేసి రామవరం ఎస్‌సీబీనగర్‌లో ఉంటున్న జీకే సంపత్ నివాసం వద్దకు చేరుకుని అరెస్టు చేశారు. గతంలో సీఎండీ నియామకం చెల్లదని, విధుల పొడిగింపుపై ఈయన హైకోర్టులో కేసులు దాఖలు చేశారు.

స్వర్ణకవచ ధారణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక కుంకుమార్చన

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయంలోని బేడా మండపంలో శ్రీలక్ష్మీతాయారు అమ్మవారికి కుంకుమార్చన జరిపారు. ఈఓ ఎల్.రమాదేవి పర్యవేక్షించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవహారాలన్నీ ఆన్‌లైన్‌లోనే..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం అకౌంట్స్ వివరాలను మొత్తం పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ చేశారు. ఈ ఫైనాన్షియల్ మాడ్యూల్ పోర్టల్‌ను ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు, పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అన్నం ఫౌండేషన్‌కు దివ్యాంగురాలి తరలింపు

దుమ్ముగూడెం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు 7నెలల గర్భం దాల్చిన విషయం తెలిసిందే. కాగా, ఆమెను, ఆమె తండ్రిని శుక్రవారం అధికారులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. దివ్యాంగురాలికి తల్లి లేకపోవడంతో తండ్రి సంరక్షణలోనే ఉంటోంది. బాధితురాలికి ఆరోగ్యం దెబ్బతినడంతో వైద్యశాలకు తీసుకెళ్లగా గర్భం దాల్చిన విషయం వెలుగుచూసింది. అనంతరం ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. అఘాయిత్యానికి పాల్పడిన వారిని గుర్తించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం బాధితురాలు 7 నెలల గర్భిణికావడంతో గ్రామంలో ఆమె సంరక్షణ చూసేవారు లేకపోవడంతో డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనిన ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్‌కు తహసీల్దార్ అశోక్‌కుమార్, సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్ సహానా సుల్తానా సమక్షంలో అప్ప గించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దివ్యాంగురాలికి అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ఆర్సీఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (దమ్మపేట)లో శుక్రవారం ఖమ్మం ఆర్సీఓ అరుణ విచారణ చేపట్టారు. డిగ్రీ కళాశాలలో సమస్యలు, అధ్యాపకురాలు పాముకాటుకు గురికావడంపై 'సాక్షి'లో 'డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి పాముకాటు' శీర్షికన వచ్చిన కథనంపై ఆర్సీఓ స్పందించారు. గత నెల 27వ తేదీన కొందరు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఆమె డిగ్రీ కళాశాలను సందర్శించి, విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. పాముకాటుకు గురైన కళాశాల అధ్యాపకురాలి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ స్పందన, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండాలా.. పోవాలా..?


వాహనం వెళ్తుండగా లేస్తున్న దుమ్ము

- దుబ్బమయమవుతున్న అశ్వారావుపేట రహదారి
- దుమ్ము.. ధూళితో ప్రజల అవస్థలు
- ఏళ్లుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు


జాతీయ రహదారిపై గుంతలు పూడ్చేందుకు వినియోగిస్తున్న మట్టి

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 4 కిలోమీటర్ల మేర ఉన్న జాతీయ రహదారి, భద్రాచలం రహదారి వెంట డ్రెయినేజీ, డివైడర్ పనులు ఏడాదికి పైగా కొనసాగుతూనే ఉన్నాయి. రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు నెలల వ్యవధిలోనే పూర్తి కావాల్సి ఉండగా ఏళ్ల తరబడి కొనసాగడం విడ్డూరంగా ఉన్నా.. పట్టణవాసులకు మాత్రం శాపంగా పరిణమించింది. ఖమ్మం రహదారిలోని ఏకే గ్రాండ్ రెస్టారెంట్ వెనుకున్న ఖాళీ స్థలంలో, జంగారెడ్డిగూడెంరోడ్‌లోని ఇరిగేషన్ స్థలంలో (ప్రస్తుత స్టేడియం స్థలం), భద్రాచలంరోడ్‌లో సంత మార్కెట్ సమీపంలోని రహదారిపై ఇసుక, సిమెంట్, కంకర, ఫ్లైయాష్ నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచే అజాక్స్‌లలో కాంక్రీట్ కలుపుకుని వెళ్తున్నారు. అయితే, నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలల తరబడి రాకపోకలకు అడ్డుగా నిర్మాణ మెటీరియల్ పడేశారు. నివాస గృహాల మధ్యలో కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దుమ్ము, ధూళితో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

రహదారిపై గుంతల సంగతి అంతే..

అశ్వారావుపేట రింగ్ నుంచి ఉన్న మూడు రహదారులు గుంతల మయంగా మారాయి. దీంతో వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము విపరీతంగా లేస్తోంది. రింగ్ సెంటర్‌లో భారీ వాహనాల ఇరుసులు విరిగి నిలిచిపోతున్నాయి. గతంలో వెట్‌మిక్స్‌తో గుంతలను నింపారు. కానీ, ఎండలకు సరిగా క్యూరింగ్ చేయక దుమ్ము రేగుతోంది. పది రోజుల్లో ఓ వారం వర్షం పడటంతో దుమ్ముకు బదులు బురదతో జనం సతమతమయ్యారు. వర్షం వెలిసింతే తడవు.. దుమ్ము రేగుతోంది. ఉన్న మట్టి చాలదన్నట్లు తిరిగి మట్టితో గుంతలను నింపారు. దీంతో దుమ్ము మరింత పెరిగింది. జాతీయ రహదారి వెంట వ్యాపార సముదాయాల్లో దుమ్ము పేరుకుపోతోంది. జాతీయ రహదారికి సుమారు 400 మీటర్ల దూరం వరకు దుమ్ము వ్యాపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. భారీ గుంతలను బీటీతో పూడ్చి దుమ్ము నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై ఆర్అండ్‌బీ డీఈఈ ప్రకాష్‌ను వివరణ కోరగా పెనుబల్లి నుంచి ప్రత్యేకంగా వెట్‌మిక్స్, గ్రావెల్ కలిపిన మిశ్రమం తెచ్చామన్నారు. నిధులు ఉన్నాయని, ప్రతిపాదనలు పంపి ఆమోదం పొందితే పనులు చేపడతామని వెల్లడించారు.

స్వల్పంగా పెరిగిన ఆయిల్‌పామ్ ధర

అశ్వారావుపేటరూరల్: గడిచిన కొద్ది నెలలుగా ఆయిల్‌పామ్ గెలల ధర తగ్గుతుండగా, తాజాగా స్వల్పంగా పెరిగింది. శుక్రవారం ఆయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఉన్నతాధికారులు సమావేశంలో టన్ను గెలల ధర రూ. 18,052గా నిర్ణయించారు. గత నెల టన్ను ధర రూ.17,463 ఉండగా, తాజాగా రూ. 589 పెరిగింది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రవీణ్‌ప్రకాష్ (ఫైల్)

బూర్గంపాడు: మండలంలోని ముసలిమడుగు గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సందెళ్లరామాపురం గ్రామానికి చెందిన కోటేశ్వరరావు (35) శుక్రవారం మోటార్ సైకిల్‌పై లక్ష్మీపురం నుంచి ముసలిమడుగు వైపు వెళ్తుండగా గేదె అడ్డువచ్చింది. తప్పించే క్రమంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడింది. కోటేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కాగా, ఆయన్ను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కోటేశ్వరరావు మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గుండాల: చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మామకన్ను గ్రామానికి చెందిన కల్తీ ప్రవీణ్‌ప్రకాష్ (23) ఆళ్లపల్లి మండలం అనంతోగు గ్రామం వద్ద కిన్నెరసానిపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. కాగా, చేపల వల విసరగా వాగులో వల చిక్కుకుంది. ఆ వలను తీసేందుకు వాగులో దిగి.. అందులోనే చిక్కుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆళ్లపల్లి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. అయితే, చెక్‌డ్యాం నిర్మిస్తున్న ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండడంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఓ బాలుడు సైతం ఇదే ప్రాంతంలో మృతి చెందాడు.

వివాహిత ఆత్మహత్య..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన వివాహిత శశికుమారి (33) ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కాగా, భార్య మృతిని తట్టుకోలేక ఆమె భర్త రామకృష్ణ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరినట్లు సమాచారం. రామకృష్ణ, శశికుమారికి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం శశికుమారి మృతదేహన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఉంచారు. ఆమె ఆత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అకారణంగా దాడి చేశారని ఫిర్యాదు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన జర్పుల చందర్.. తన కుమారుడు సాయికిరణ్‌పై అకారణంగా దాడి చేసి గాయపర్చాడని తండ్రి పరశురాం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పొలం వద్ద పని చేసుకుంటున్న సాయికిరణ్ వద్దకు వెళ్లి పారతో తలపై బలంగా కొట్టాడని, ఇదేమిటని ప్రశ్నిస్తే తమ కుటుంబాన్ని అసభ్య పదజాలంతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు.